సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి

మియాపూర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): పేద ఆడపడుచుల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు మంజూరైన ఒక కోటీ 11 లక్షలా 12 వేలా 876 రూపాయలను లబ్ధిదారుల కుటుంబసభ్యులకు సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పని చేస్తుందన్నారు. అర్హులైన అందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్ గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, అన్వర్‌షరీఫ్, గంగాధర్, ప్రసాద్, చంద్రిక పాల్గొన్నారు.

● **హైదర్‌నగర్:** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పీఏసీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.



నిరంజన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న శేరిసతీష్‌రెడ్డి, సంజీవరావు తదితరులు

బీసీ కమిషన్ చైర్మన్‌కు అభినందనల వెల్లువ

ఫతేనగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్‌గా గోపిశెట్టి నిరంజన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు శేరి సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సంజీవరావు ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నిరంజన్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రేష్మ, అరవింద్‌రెడ్డి, ఫణీంద్రకుమార్, లుంగీరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకుంటాం

గచ్చిబౌలి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో చేపట్టిన ప్రజావాణిలో పింఛన్ల కోసం దరఖాస్తులు వెలువెత్తాయి. సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువ మంది పెన్షన్ కోసం దరఖాస్తులు ఎక్కువమంది ఇచ్చినట్లు ఉపకమిషనర్ తెలిపారు. కాగా అక్రమ నిర్మాణాలపై కూడా దరఖాస్తులు అందాయన్నారు. పారిశుధ్యం, ఫాగింగ్, దోమల నివారణపై దరఖాస్తులు వచ్చాయని వీటిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని..

బేగంపేట మహిళా పీఎస్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బేగంపేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తనని వేధించాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు భర్తకు కౌన్సెలింగ్ కోసం స్టేషన్‌కు పిలవడంతో అవమానంగా భావించిన అతడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పి గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం గాంధీకి తరలించారు. ఈ సంఘటన బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారంగేట్‌కు చెందిన పత్తిపాటి అఖిల్, సరితలు భార్యాభర్తలు. భర్త డ్రైవర్‌గా పనిచేస్తూ నిత్యం మద్యం తాగి భార్యను వేధించేవాడు. దీంతో ఆమె మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కౌన్సెలింగ్ కోసం పోలీసులు అఖిల్‌ను స్టేషన్‌కు పిలిచారు. ఈ క్రమంలో అఖిల్ తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను స్టేషన్‌లోనే ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. దీంతో పోలీసులు మంటలను ఆర్పివేశారు. స్వల్ప గాయాలు కావడంతో అఖిల్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అఖిల్‌పై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

గచ్చిబౌలి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ చైర్మన్, సభ్యులు సోమవారం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌ను కలిసి మార్కెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై వినతి పత్రం అందజేశారు. దీనికి కార్పొరేటర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు వీరేశంగౌడ్, ఉపాధ్యక్షుడు ఖాజాపాషా, ట్రెజరర్ శ్రీనివాస్, పాండు, సాయి, మొయిన్, సల్మాన్, మల్లేష్, సాయి, లాల, చిన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

హైదర్‌నగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్‌లోని ప్రకాష్ నగర్ డబుల్‌రోడ్, హెచ్‌ఎల్‌కాలనీ, వైష్ణవినగర్, అమూల్య చౌరస్తా, సాయిబాబానగర్‌లో కొత్తరోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రభాకర్, ఇంజనీరింగ్ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శభావాలు పెంపొందించుకోవాలి

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధిలో లక్ష్యసాధనలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకం అని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ నార్త్‌సిటి హైస్కూల్‌లో ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సన్మానించి అవార్డులు అంజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యన్నారాయణ, మాజీ కార్పొరేటర్ జి. సురేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, పాఠశాల కరస్పాండెంట్ కోలా వెంకటేష్, ప్రిన్సిపల్ రమాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


12న ఐటీఐ కాలేజీలో జాబ్‌మేళా

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఆ రోజు ఉదయం 11 గంటలకు టాటా కంపెనీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పాసైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు (ఒరిజినల్, జిరాక్స్)తో మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8328428933లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లీడ్‌ఇండియా శిక్షణ కార్యక్రమం

చందానగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీడ్ ఇండియా మిషన్-2047 'మీ అభివృద్ధి- దేశాభివృద్ధి' అనే అంశంపై చందానగర్ సరస్వతి విద్యామందిర్‌లో శిక్షణ నిర్వహించారు. పాఠశాలలో 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రొఫెసర్ సుదర్శన్, శ్రీనివాస్ ఆచారి, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బిల్డర్లు నర్సింహరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు పాపారావు, నరేంద్రప్రసాద్, రామచంద్రారెడ్డి, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీడిమెట్ల ఇండస్ట్రియల్ చైర్మన్‌గా పీడీఎస్ఎన్ రాజు



పీడీఎస్ఎన్‌రాజు

జీడిమెట్ల, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ చైర్మన్‌గా పీడీఎస్ఎన్ రాజు సోమవారం ఎన్నికయ్యారు. గతంలో పని చేసిన కమిటీ కాలం పూర్తికావడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా పి.భాస్కరావు, సెక్రటరీగా పి.కృష్ణ, జాయింట్ సెక్రటరీగా కె.రామ్‌తిలక్, కోశాధికారిగా పి.కృష్ణమోహన్, కమిటీ సభ్యులుగా ఏ.అక్షరారెడ్డి, ఎస్.వెంకటేష్, రామకుమార్‌దేవత, ఇందుకూరి భాస్కర్ రాజు, ఎం.కె.వి.రాజు, ఎం.వి.కృష్ణరావు ఎన్నికయ్యారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

గాజులరామారం, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ రావుల శేషగిరి సోమవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సోమవారం అందజేశారు. కైలాస్‌హిల్స్, షిరిడీహిల్స్ కాలనీలలో పార్కు స్థలం, కమ్యూనిటీహాల్, రోడ్ల సమస్యలను తీర్చాలని కమిషనర్‌కు వివరించారు.

నిమజ్జనాలు షురూ..

రెండోరోజూ గణనాథులకు పూజలు, అన్నదానాలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

గణేశుల నిమజ్జనాలు షురూ అయ్యాయి. తొలిరెండు రోజులు రెండు అడుగులలోపు విగ్రహాలు రాగా.. మూడో రోజు సోమవారం అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, కాలనీ వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. కూకట్‌పల్లి ఐడీఎల్ (రంగదాముని చెరువు) వద్ద సాయంత్రం నుంచి నిమజ్జనంకు వచ్చే భక్తులతో సందడి నెలకొంది.

చిత్తారమ్మగుడి వద్ద బేబీపాండ్ ఏర్పాటు

హైదర్‌నగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వివేకానందనగర్ డివిజన్‌లో చిత్తారమ్మగుడి దగ్గర జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన బేబీపాండ్‌ను కార్పొరేటర్ రోజాదేవి పరిశీలించారు. మూడు అడుగుల వినాయకుల వరకు ఇక్కడ నిజ్జనం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆశా వర్కర్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి పాల్గొన్నారు.

● గాజులరామారంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ గాజులరామారం గ్రామంలో గణేశ్ వద్ద అన్నదానం చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీసీ

ఓల్డుబోయినపల్లి: ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట్ బోయిన్ చెరువు వద్ద చేపట్టిన నిమజ్జనం ఏర్పాట్లను కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మూడో రోజు కావడంతో గణేశ్ నిమజ్జనాలు మొదలవుతాయని అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.



కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద బేబీ పాండ్స్‌లో నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు



హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్ హఫీజ్‌పేటలో వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, బాలింగ్ గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాబుగౌడ్, అన్వేష్‌గౌడ్, బస్సీగౌడ్, లక్కీగౌడ్, ప్రణవ్‌గౌడ్



ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్‌చెరువు వద్ద గణేశులను నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



బాలానగర్ డివిజన్‌లో గణేశుడిని దర్శించుకున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో బీఆర్ఎస్ నేతలు



చెరువు వద్ద ఉన్న నిమజ్జనపు సిబ్బందిని వివరాలు తెలుసుకుంటున్న కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య



గణనాథుడిని బతుకమ్మకుంట వద్దకు నిమజ్జనానికి తీసుకువస్తున్న భక్తులు



గాజులరామారం ప్రకాశంపతులునగర్‌లో పూజా కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి శౌంభిరెడ్డి పున్నారెడ్డి



బాలాజీనగర్‌లో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకున్న సినీ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి తదితరులు

ముఖానికి స్కార్ఫ్ ఎందుకు కట్టుకున్నావని

మహిళా కండక్టర్‌పై దాడి.. వ్యక్తి అరెస్ట్



విజయేందర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న కండక్టర్‌పై అకారణంగా దాడి చేసిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ నుంచి పటాన్‌చెరు వెళుతున్న బస్‌లో బానోత్ రాణి కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న జీడిమెట్ల పంచశీల ఎన్‌క్లేవ్‌కు చెందిన విజయేందర్‌రెడ్డి(56) అకారణంగా కండక్టర్‌ను దుర్భాషలాడాడు. అంతేకాకుండా దాడి కూడా చేశాడు. వెంటనే స్పందించిన డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేపీహెచ్‌బీ పోలీసులు నిందితుడు విజయేందర్‌రెడ్డిని అరెస్ట్ చేశాడు. పోలీసులు ఎందుకు కండక్టర్‌పై దాడి చేశావని ప్రశ్నించగా కండక్టర్ ముఖానికి స్కార్ఫ్ కట్టుకుందని, అందుకే దాడి చేశానని చెప్పాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జీడిమెట్ల పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జీడిమెట్ల, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీసుల వేధింపులు, దెబ్బలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ గ్రామంలో హనుమాన్‌రామ్ అనేవ్యక్తి స్టీల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని ఇల్లుకూడా షాప్‌పైన ఉంది. గత నెల 31వ తేదీన హనుమాన్‌రామ్ బెంగుళూరులో తన సోదరి ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు కుటుంబంతో కలిసి వెళ్లాడు. తిరిగి ఈనెల 3వతేదీన ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళాలు పగలగొట్టి బీరువాలోని 14 లక్షల రూపాయాలు చోరీ అయ్యాయి. ఈ విషయం గమనించిన హనుమాన్‌రామ్ తన వద్ద పనిచేస్తున్న కిషన్‌పై అనుమానంతో జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కిషన్‌ను, అతడిని ఉద్యోగంలో పెట్టించిన భాగ్యలక్ష్మీకాలనీలో నివాసముండే అశోక్‌ను అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్ చేశారు. ఈ క్రమంలో చోరీ అయిన 14 లక్షల రూపాయలు ఇవ్వాలని అశోక్(26)పై ఒత్తిడి తీసుకొచ్చారు. పోలీసుల దెబ్బలకు తాళలేక, తీవ్ర మనస్థాపానికి గురైన అశోక్ ఆదివారం ఉదయం పోలీసులకు భయపడి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అతడి భార్య గుర్తించి స్థానికుల సాయంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ ఘటనపై పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవలేదని ఆరోపిస్తున్నారు. జీడిమెట్ల పోలీసులపై కేసునమోదు చేయాలని అశోక్ కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంపై జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌ను వివరణ కోరగా మామూలుగా పిలిచి మాట్లాడేమే తప్పా కొట్టలేదన్నారు. ఈకేసులో కిషన్‌ను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు మాత్రం జీడిమెట్ల పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరవై రోజులుగా విధులకు హాజరుకాని ఏసీపీ

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన అధికారి 20 రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ఇరవై రోజుల క్రితం సర్కిల్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సాయిబాబా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అక్కడ పని చేస్తున్న సురేందర్‌రెడ్డి కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు బదిలీచేస్తూ జీహెచ్‌ఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పది రోజుల క్రితం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సురేందర్‌రెడ్డి తిరిగి ఇప్పటి వరకూ విధులకు రాకపోవడంతో చర్చాంశనీయంగా మారింది. డిప్యూటీ కమిషనర్ నర్సింహ సురేందర్‌రెడ్డికి మెమో కూడా జారీ చేసినట్టు తెలుస్తోంది. దీంతో సురేందర్‌రెడ్డి ఉపకమిషనర్‌తో వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. ఏదిఏమైనా సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ లేకపోవడంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తనకు అనారోగ్యంగా ఉందని సురేందర్‌రెడ్డి పేర్కొంటున్నట్టు తెలుస్తోంది.

మలేషియన్‌టౌన్‌షిప్ పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

హైడ్రాకు ఫిర్యాదు చేసిన సీనియర్ సిటిజన్

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మలేషియన్ టౌన్‌షిప్ (రెయిన్ ట్రీ పార్కు)లో ఐజేఎం బిల్డర్ పార్కుల స్థలాల్లో కమర్షియల్ భవనాలు నిర్మించారని, వెంటనే వాటిని తొలగించాలని ప్రజాఆలోచన, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు సోమవారం హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 2004 హుడా లే అవుట్ ప్రకారం.. 3.99 ఎకరాల్లో ఏడు పార్కులు చూపించగా.. ప్రస్తుతం పార్కు-4లో మెడికల్ షాపులు, పార్కు-6లో మోర్ మార్కెట్ నిర్మించి లక్షల రూపాయలు అద్దెలు తీసుకుంటున్నారన్నారు. సదరు బిల్డర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఐదు ఎకరాల కమర్షియల్ స్థలం కాజేసేందుకు కాలనీకి అవసరమైన కమర్షియల్ షెడ్లు పార్కు స్థలాల్లో నిర్మించారని, అనధికారికంగా నిర్మించిన వాటిని తొలగించి, పార్కులను అభివృద్ధి చేయాలని ఈమెయిల్ ద్వారా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 2014 నుంచి అప్రూవ్డ్ లే అవుట్ ప్రకారం నిర్మాణాలు జరగలేదని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా హైడ్రా టీం మలేషియన్ టౌన్‌షిప్‌ను సందర్శించి అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించి, బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను వదిలేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మియాపూర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ దుర్గారామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెర్ల వెంకట లక్ష్మీకాంత్ రెడ్డి(18) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కల్కి గార్డెన్స్ మదీనగూడలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లి బకెట్‌లో నీళ్లు పోసి వేడి చేయడానికి కరెంటు హీటర్ పెట్టాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీళ్లలో చేయి పెట్టి హీటర్ తీయడానికి ప్రయత్నం చేయగా కరెంటు షాక్ తగిలి కిందపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, నందిగామ గ్రామానికి చెందిన ఎం.వినోద్‌కుమార్(35) నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్ శ్రీరాంనగర్‌లో ఉంటున్నాడు. బోయిన్‌పల్లిలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈనెల 8న తన పెళ్లి రోజు, వినాయకచవితి పండుగ ఉండటంతో యూసుఫ్‌గూడలో ఉంటున్న తన భార్యపిల్లలతో కలిసి ఆమె సోదరుని ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతిపై స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అప్పుల వారి వేధింపులతోనా, లేదా లోన్‌యాప్‌ల ఒత్తిడితో మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వం హామీలను నెరవేరుస్తుంది'

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆహ్వానం మేరకు దూలపల్లిలోని ఓ కార్యక్రమానికి విచ్చేసి ఖమ్మంలోని వరద బాధితులకు సహాయార్థం నిత్యావసర వస్తువుల పంపిణీ వాహనాలను జెండాఊపి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు దూలపల్లిలో నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు మహేషకుమార్‌గౌడ్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందరిని కలుపుకొని పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తానన్నారు. ప్రతిపక్షాలు ఏదోఒకటి మాట్లాడాలని విమర్శలు చేస్తున్నాయని, ఏడున్నర లక్షల కోట్లు అప్పు రాష్ట్రాన్ని పెట్టిపోయాడని ఆరోపించారు. వరద బాధితులకు పంపిణీచేసే కిట్లలో 25 కేజీల బియ్యం బ్యాగుతో పాటు 11 రకాల సరుకులను వెయ్యి కుటుంబాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, ఎం.సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, కొలన్ హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లై వుడ్ కంపెనీలో అగ్నిప్రమాదం

జీడిమెట్ల: ప్రమాదవశాతు షార్ట్ సర్క్యూట్ కారణంగా గాజులరామారం మహదేవపురం చౌరస్తాలోని ప్లైఉడ్ కంపెనీలో సో మవారం భారీ అగ్నిప్రమాదం జరిగిది. ఈప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయా లు కాకపోయినా దాదాపు 50 లక్షల వరకు ఆస్థినష్టం సంభవించింది. రెండు ఫై రింజన్‌లు సిబ్బంది గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. వివరాల్లోకి వెళితే.. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహదేవ్‌పురంలో కరన్‌గౌడ్ అనే వ్యక్తి శ్రీసాయిఎంటర్‌ప్రైజెస్ పేరుతో ప్లైఉడ్ షీట్స్, డోర్‌ల కంపెనీని నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. రెండు ఫైర్ ఇంజన్‌లు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. దాదాపు 50 లక్షల విలువ చేసే ఆస్తి బుగ్గిపాలయిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో అండాశయ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి నయం చేసుకోవచ్చని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్యాకేజీ పోస్టర్‌ను మెడికవర్ ఆస్పత్రిలో సోమవారం స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కన్సల్టెంట్, సర్టిఫైడ్ ఫంక్షనల్ ట్రైనింగ్ అండ్ వెల్‌నెస్ కోచ్ దీప్తి అక్కి ప్రారంభించారు. మెంటల్ హెల్త్ అడ్వకేట్, ఫిట్‌నెస్ ఎంటర్‌ప్రెన్యూర్ లహరి విష్ణువర్ధుల, సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ అడుసుమిల్లి, ఆస్పత్రి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ దెగ్లూర్కర్‌లు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ అడుసుమిల్లి మాట్లాడుతూ.. ప్రతీ 87 మంది మహిళల్లో ఒకరు అండాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. ఈ తరహా క్యాన్సర్‌లో లక్షణాలు త్వరగా బయటపడవని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. దీప్తి అక్కి మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, ఇతరత్రా కారణాలు వల్ల మహిళల్లో ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురుకుంటున్నారన్నారు. 40 ఏళ్లు మించిన వారుఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ శిబిరంలో క్యాన్సర్ యాంటిజెన్, అల్ట్రాసౌండ్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సి బి పి), ఆర్‌బీఎస్ (షుగర్ టెస్ట్)పరీక్షలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోగా చేస్తారని తెలిపారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.

ఐసెట్ ధ్రువపత్రాల పరిశీలనకు నేటితో ఆఖరు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐసెట్)లో అర్హత పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ మంగళవారంతో ముగుస్తుందని సాంకేతిక విద్యాశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఇప్పటి వరకు మొత్తం 31,999 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు పేర్కొన్నారు. వీరిలో 12,268మంది అభ్యర్థులు మొత్తం 1,79,860 ఆప్షన్లు ఇచ్చుకున్నారని, అత్యధికంగా ఒక అభ్యర్థి 309 కళాశాలలకు ఆప్షన్లు పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 11తో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగుస్తున్నందున, వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు గడువులోగా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన ధనేశ్వర్ యాదవ్(40), నాలుగు నెలల క్రితం బతుకు దెరువు కోసం వలస వచ్చి మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లిలోని చర్మాస్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. ఈనెల 8న సెలవు కావడంతో కొంపల్లిలోని కూరగాయాల మార్కెట్‌కు సాయంత్రం పరిశ్రమకు చెందిన వాహనంలో తనతోటి ముగ్గురు ఉద్యోగులతో కలిసి వెళ్తున్నారు. మార్గమధ్యంలో అతివేగంతో దూలపల్లి నాగార్జున డ్రీమ్‌ల్యాండ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ధనేశ్వర్‌యాదవ్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు కాళోజీ

● హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి

● కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య పిల్లలమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు, వారిజారాణి



కాళోజీ జయంతి సభలో ఆచార్య పిల్లలమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు, వారిజారాణి, త్రివేణి తదితరులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ భాష, యాస కోసం 'నా గొడవ' ద్వారా తన జీవిత పర్యంతం పరితపించిన గొప్ప మానవతావాది ప్రజాకవి కాళోజీ అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు కొనియాడారు. కాళోజీ జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యంలోని గొప్పతనాన్ని విశ్లేషిస్తూ ప్రసంగించారు. తెలంగాణ తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా సోమవా రం సెంట్రల్ వర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడారు. నిజాం వ్యతిరేక పోరాటంలో కాళోజీ పాత్రను గుర్తుచేశారు. పత్రికలు, పాలకుల భాష మాత్రమే ప్రజల భాష కాదని, ప్రజా వ్యవహారంలోని భాషను సగౌరవంగా ఆదరించాలని నినదించిన భాషావాది కాళోజీ అని అభివర్ణించారు. ఆచార్య పి.వారిజారాణి మాట్లాడుతూ పీడిత వర్గనిర్మూలనే లక్ష్యం గా కాళోజీ కవిత్వం రాశారని, ఆయన కలం నుంచి జాలువారిన ప్రతీ అక్షరం అసమానతలను నిలదీస్తుందన్నారు. కాళోజీ భాషా వైవిధ్యం అంశంపై పి. విజయ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ సజీవ భాషలోని ఔన్నత్యాన్ని వెలుగెత్తిచాటిన మహనీయుడుగా కాళోజీని కొనియాడారు. ఆచార్య వి.త్రివేణి, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య డి.విజయలక్ష్మి, భూక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్ కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

క్షేత్రస్థాయి ఫిర్యాదులపై డిస్కం సీరియస్..!

● ప్రతి కార్యాలయంలో అవినీతి సెల్ ఫిర్యాదు నంబర్లు

● మొదట మెమోలు.. తీరు మార్చుకోకపోతే సస్పెన్షన్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పని తీరు, అవినీతి ఆరోపణలపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి విద్యుత్ కార్యాలయంలో అవినీతి సెల్‌కు సంబంధించిన ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండేలా 10 వేల పోస్టర్లు డిస్కం కార్యాలయాల్లో అంటిస్తున్నారు. పని దినాల్లో (వర్కింగ్ డేస్) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని అధికారులు చెబుతున్నారు. నిబంధనల పేరుతో కొంతమంది అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ విద్యుత్ సంస్థలకు చెడ్డపేరు తెస్తున్నారని దీంతో అక్రమాధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ దృష్టి సారించారు. ఫిర్యాదులు వచ్చే అధికారులు, సిబ్బందిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేయించడంతో పాటూ తప్పుచేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందికి మొదలు మెమోలు జారీ చేస్తామని, అప్పటికీ వారితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

దక్షిణ డిస్కం పరిధిలో మొత్తం 20 సర్కిళ్లు ఉండగా గ్రేటర్‌జోన్ పరిధిలో 10 సర్కిళ్లు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని సర్కిళ్ల నుంచి విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. అవినీతి ఫిర్యాదులపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 040- 23454884, 7680901912 ఈ నెంబర్లకు పని దినాల్లో ఫిర్యాదు చేయొచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు.